జడ్పీ వైస్‌చైర్మన్‌ను కలిసిన సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రజాశక్తి- యాదమరి: చిత్తూరు జిల్లా జడ్పీ వైస్‌చైర్మన్ ధనంజయరెడ్డిని సిపిఎం జిల్లా కార్యదర్శి గంగరాజు మర్యాదపురం కలిశారు. ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా ఆయన స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాశక్తి దినపత్రిక మేనేజరు సిఎస్ ప్రసాద్ , డివిజనల్ ఇంచార్జ్ దాము, పీసీ సెంటర్ ఇన్చార్జి బాలసుబ్రమణ్యం, విలేకరి రాజేష్, కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?

- అంతర్రాష్ట్ర రహదారి విస్తరణ ఎప్పుడో...
- గుంతలమయంగా చిత్తూరు- గుడియాత్తం రహదారి

ప్రజాశక్తి- యాదమరి

జిల్లా కేంద్రం నుంచి యాదమరి మీదుగా తమిళనాడు రాష్ట్ర సరిహద్దు వరకు వెళ్లాలంటే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నారు. చిత్తూరు నుండి యాదమరి వరకు రోడ్లు బాగానే ఉన్నా అక్కడ నుంచి ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు ప్రాంతం వరకు రోడ్డంతా గోతులమయంగా మారింది. ముందుకు సాగలేక వెనుకు రాలేక నానా అవస్థలు పడుతూ వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాల్లో, కారులో వెళ్లాలంటే వారి పరిస్థితి మరీ దారుణం. పలువురు ఈ మార్గంలో ఉన్న గోతుల్లో పడి మతిచెందినా అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

అంతర్రాష్ట్ర రహదారులలో రాళ్లు తేలిపోయిన దృశ్యం

అంతర్రాష్ట్ర రహదారి రోడ్ల గోతులు కారణంగా కాశిరాల కొత్తూరు గ్రామానికి చెందిన ఇన్పుల్ శెట్టి ద్విచక్రవాహనంలో వెళుతూ జోడి చింతల విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో గోతులో పడి మతిచెందాడు. అలాగే పచ్చపూరు గ్రామపరిధిలో తమిళనాడుకు చెందిన ఇల్లంగోవన్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ రాత్రి సమయంలో తీవ్ర గాయాలపాలై మతి చెందాడు. మార్లబండ రహదారి గోతుల కారణంగా ద్విచక్ర వాహనంలో తమిళనాడుకు చెందిన ఓ మహిళ మార్లబండ వద్ద ఉన్న గోతిలోపడి తీవ్రగాయాల పాలైంది. అనంతరం ఆసుపత్రిలో మతిచెందిందని సమాచారం. ఇవేకాదు నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులలో ఏమాత్రం చలనం రావడం లేదు. తమకెందుకులే అని మిన్నుకుండి పోతున్నారు. చిత్తూరు గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది.

గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి

విస్తరణ పేరుతో రోడ్ల భవనాలశాఖ అధికారులు మరమ్మతులు చేపట్టడంలో అలసత్వంతో వ్యవహరిస్తున్నారు. నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికుల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయి. విస్తరణకు ఎన్‌డిబి సర్వే పూర్తిఅయిన ఆపై అడుగు ముందుకు పడలేదు. కొత్తగా రోడ్లపై దారివేసి బాగు చేసేందుకు రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆర్అండ్‌బి అధికారులు చెబుతూనే ఉన్నారు. ఏళ్ళు గడిచిపోతున్న రహదారి బాగుపడింది లేదు. ప్రయాణం సాఫీగా సాగిపోయేది లేదు.

వర్షాలకు గుంతల మయంగా మారిన రోడ్లు

ఇటీవల కురిసిన వర్షాలకు చిన్నచిన్న గుంతలు గోతులుగా మారాయి. జోడి చింతల పోలీస్‌స్టేషన్ నుండి కనికాపురం చెక్‌పోస్ట్ వరకు అడుగుకు ఓగుంత ఏర్పడింది. రాత్రి సమయాల్లో ఈ దారి గుండా ప్రయాణించాలంటే ద్విచక్ర వాహనదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు ఎవరో ఒకరు ఈ గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. రూపాయల లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన కార్లు ఈ దారిలో వెళ్తే పాడైపోతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తమిళనాడు రాష్ట్రంకు దగ్గర కావడంతో..

రాష్ట్రం నుంచి తమిళనాడులోకి ప్రవేశించేందుకు దగ్గర దారి కావడంతో సరిహద్దు నుంచి 20కిలోమీటర్లు ప్రయాణిస్తే చెన్నై బెంగళూరు అంతర్ రాష్ట్ర రహదారిలోకి చేరుకోవచ్చు. ఆపై క్రిష్ణగిరి, సేలం, ఈరోడ్డు, కోయంబత్తూరుతో పాటు తమిళనాడులోని వివిధ నగరాలకు ఈ ప్రాంతాలు చేరుకోవచ్చు. రవాణా శాఖ తనిఖీ కేంద్రం లేకపోవడంతో అధిక రోడ్డులో వెళ్ళిన ఎలాంటి అపరాధరసం చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో ఎక్కువగా లారీలు ఈ రోడ్డుపై వెళ్తుంటాయి. ఫలితంగా తాత్కాలిక మరమ్మతులు చేయించిన రోజులు వ్యాధిలోని మళ్లీ గుంతలు మయమవుతుంది. రెండు నెలలకు ముందు ఈ రహదారిలో గ్రావెల్ మిక్సింగ్ వేయడంతో ఈ వర్షాలకు పూర్తిగా కొట్టుకెళ్ళింది. దీంతో ప్రస్తుతం రోడ్డు మీద పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. రోడ్లు పూర్తిగా చిందర వందర కావడంతో భారీ వాహనాలు వెళుతున్న కొద్ది దుమ్ము విపరీతంగా రావడంతో ముందు వెళ్తున్న వెనుక వస్తున్న వాహనాలు పూర్తిగా కనిపించడం లేదు. దీనిద్వారా వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు.

నాలుగేళ్లుగా అధ్వానంగా...

- రవి, వాహనదారుడు

చిత్తూరు గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి దారుణంగా ఉంది. జోడి చింతల నుంచి తమ గ్రామాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన ఫలితం లేదు ప్రత్యాన్మయ మార్గం లేక చేసేది లేక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నాం.

ఈ దారిలో ప్రయాణించాలంటే నరకయాతన

- గోపి, కసిరాళ్ల వాహనదారుడు

ఈ దారిలో పగటిపూట ప్రయాణించాలంటే విపరీతమైన దుమ్ముతో నిండిపోతుంది. దీంతో వెనుక వస్తున్న వాహనాలుకు దారి కనిపించక ప్రమాదాలు భారినపడుతున్నాం. ప్రతిరోజు రాత్రిపూట ఈదారిలో రావాలంటే తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఎదురుగా వాహనాలు వస్తే ఎక్కడ గోతులున్నాయని గాని కనిపించడం లేదు. దీంతో పలురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

'కోవిడ్'ను సమర్థవంతంగా ఎదుర్కొంటాం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ప్రకాశం

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఓమిక్రాన్ వెరియంట్‌ను ఎదుర్కొవాడానికి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని సన్నద్ధం చేశాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పూర్తిగా అప్రమత్తంగా ఉన్నారు. ఇప్పటికే కరోనా లక్షణాలను గుర్తించిన వ్యక్తులకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించేలా ఏర్పాట్లు పూర్తిచేశాం. తిరుపతి జిల్లాలో కరోనా లక్షణాలు కొంత మేరకు కనిపించాయి. చిత్తూరు జిల్లాలో ఓ వ్యక్తికి కరోనా లక్షణాలు కనిపించాయి. కరోనా సోకిన్నట్లు నిర్థారణ కావడంతో మెరుగైన వైద్యం అందించడం జరుగుతోందని జిల్లా వైద్య అధికారి డాక్టర్ ప్రకాశం తెలిపారు.

వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ ప్రకాశం

ప్రజాశక్తి: థార్డ్‌వేవ్ కరోనా ప్రభావం ఏ మేరకు ప్రభావం చూపే అవకాశముంది?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: మొదటి, రెండు కరోనా సోకిన సమయాల్లో ప్రాణ నష్టం జరిగింది. రెండో వేవ్‌లో పెద్దసంఖ్యలో మృతుల సంఖ్య పెరిగింది. మూడో వేవ్‌లో ప్రాణనష్టం ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు.

ప్రజాశక్తి : కరోనా సోకుండా ఎలాంటి జాత్రలు తీసుకోవాలి?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: వైద్యఆరోగ్యశాఖ సూచన మేరకు మాస్క్‌లు ధరించడం తప్పనిసరి. ఇప్పటికే మాస్క్‌లు తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అలాగే వ్యక్తిగత శుభ్రత అవసరం తరచూ చేతులను శుభ్రం చేసుకోవడంతో పాటు శ్యానిటైజర్లు వాడాలి. చిన్న పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి.

ప్రజాశక్తి : ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు...?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: ప్రస్తుతం కరోనా సోకినవ్యక్తుల కోసం జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లో 4,10 బెడ్లు సిద్ధం చేశాం. 156 అక్సిజన్ సిలిండర్లతో పాలు వందకు పైగా వెంటిలేర్లు ఏర్పాటు చేయడం జరిగింది. నాన్ అక్సిజన్ బెడ్లు 250ఉన్నాయి. వైద్య సహాయం అందిచేందుకు స్టాఫ్ నర్సులను నియమించడం జరిగింది.

ప్రజాశక్తి: బూస్టర్ డోస్ పరిస్థితి ఏమిటి?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: ప్రభుత్వ నిబంధనల మేరకు కరోనా టీకాలు వేసుకున్న వారికి బూస్టర్ డోస్‌లు అర్బన్ హెల్త్‌సెంటర్లు, పిహెచ్‌సీలో వేయడం జరుగుతోంది. మన జిల్లాలో అవసరమైన బూస్టర్ దోసులు అందుబాటులో ఉన్నాయి. మొదటి డోస్ కరోనా టీకాలు వేసుకున్న వారి సెల్‌పోన్లకు బూస్టర్ డోస్ వేసుకోవాలంటూ మెసేజీలు పంపుతున్నాము. ఇలా వచ్చిన మెసేజీ వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది చూపితే చాలు.

ప్రజాశక్తి : కరోనా ఆంక్షలేవైనా ఉన్నాయా?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వం నుంచి నేటి వరకు ఎలాంటి ఆంక్షలు లేదు. మాస్క్‌లు ధరించడం, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచనలు చేస్తున్నాం. అలాగే జర్వంతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న వారిలో నాలుగైదు రోజులకు మించి జర్వం ఉంటే కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నాం.

సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కొత్తసంవత్సరంలో కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యపోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి చైతన్య, కాంజీవరం సురేంద్రన్‌లు సంయుక్తంగా నేడు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కార్మిక, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ కార్మికులను వేతన బానిసలుగా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ఐక్యపోరాటాల ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పెర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేసేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకుని రావడానికి ఉద్యోగులు సిద్ధపడాలని కోరారు. మరొకపక్క స్కీం వర్కర్స్‌పై పెరుగుతున్న పనిభారం, వేధింపులను కట్టడి చేయాలని వీరు డిమాండ్ చేశారు. యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్న వారిపై కక్షసాధింపు చర్యలకు పూనుకొంటున్నారని తాజాగా కుప్పం సిడిపివో 60మంది వర్కర్లకు నెలజీతం కోత విధించడం చట్ట వ్యతిరేకమని విమర్శించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని సిడిపిఒపై చర్యలు తీసుకొని అంగన్వాడీ వర్కర్స్‌కు వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతినెలా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాశక్తి దినపత్రిక 2023 క్యాలెండర్‌ను జిల్లా పరిషత్ ముఖ్యకార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ప్రతి ఏడాది ప్రజాశక్తి తీసుకొస్తున్న క్యాలెండర్‌కు విశేష ఆదరణ ఉంటోందని ప్రతి అక్షరం ప్రజల పక్షం అంటూ ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న ప్రజాశక్తి దినపత్రిక సిబ్బందిని సిఇఒ అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎడిషన్ ఇన్‌చార్జి మేనేజర్ ప్రసాద్, డివిజన్ ఇన్‌చార్జి దాము, విలేకరుల బాలసుబ్రమణ్యం, రాజేష్ పాల్గొన్నారు. అలాగే ప్రజాశక్తి కాలెండర్‌ను నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్, సహస్ర ఆసుపత్రి వైద్యులు, ఎకెఎస్ అమ్మ ఆసుపత్రి వైద్యులు ఆవిష్కరించారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు : బుల్లెట్ సురేష్

ఆంగ్ల నూతన సంవత్సర వెలుగులు చిత్తూరు ప్రజలందరికీ అందాలని ఏపి ముదలియార్ కార్పొరేషన్ చైర్మెన్ బుల్లెట్ సురేష్ ఆకాంక్షించారు. చిత్తూరు శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏపిటిఎఫ్ డైరీ ఆవిష్కరణ : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్)-1938 నాయకులు చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావును ఆదివారం ఉదయం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగలరాయ మందడి, చిత్తూరు జిల్లా అధ్యక్షులు కిరణ్, ప్రధానకార్యదర్శి నాదముని, అసోసియేట్ అధ్యక్షులు చిట్టిబాబు, సిపిఎస్ అసోసియేషన్ నాయకులు సమీర్, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి దాము పాల్గొన్నారు.

వైఎస్సార్ పింఛన్ ద్వారా 2,67,796 మందికి

రూ.73.04 కోట్లు లబ్ధి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన మాటప్రకారం అవ్వాతాతలకు అందించే పింఛన్‌ను పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి మొదటి సంతకం చేశారని జెడ్పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం చిత్తూరులోని అంబేద్కర్ భవన్‌లో వైఎస్సార్ పింఛన్ కానుక కింద రూ.2,750లు పింఛన్‌ను అందించే జిల్లాస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర విదేశీ వ్యవహారాల సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, చిత్తూరు నగర మేయర్ అముద, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, డీఆర్డీఏ పీడీ తులసి, జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, లబ్ధిదారులు, తది తరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జెడ్పి ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అవ్వాతాతలకు ఇచ్చినమాట ప్రకారం వైఎస్సార్ పింఛన్ కానుక ఇస్తున్న రూ.2,500లను రూ.250లు పెంచి నూతన సంవత్సర కానుకగా మొత్తం రూ.2,750లను ప్రతినెలా అందించనున్నారని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి నుండి ఈ పింఛన్‌ను రూ.3,000లు పెంచుతారని తెలిపారు. మహిళలకు డ్వాక్రా రుణాలు మాఫీ చేశారని తెలిపారు. ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటికే పింఛన్, ఇంటి స్థలాలు, రేషన్ కార్డు వంటి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు.

మన ప్రభుత్వంలో దాదాపుగా 64లక్షల మందికి పింఛన్లు మంజూరు చేశామని తెలిపారు. చిత్తూరు ఎంఎల్ఏ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి తన ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చినమాట ప్రకారం అవ్వాతాతలకు ఇచ్చే పెన్షన్‌ల మొత్తాన్ని ప్రతిఏటా పెంచుతున్నారని, ఇందులో భాగంగా గతంలో ఇచ్చిన రూ.2,500 పింఛన్‌ను ఈ జనవరి నుండి రూ.2,750లకు పెంచి ఇస్తున్నారని తెలిపారు.రాష్ట్ర విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకొంటూ పింఛన్లు పెంపు చేస్తున్నారని, అవ్వాతాతల ముఖంలో చిరునవ్వు చూసేందుకు అన్ని వర్గాల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశంలో ఏ రాష్ట్రంలోని విధంగా మన రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గత మూడు సంవత్సరాలుగా వివిధ రకాల పెన్షన్లు ప్రతి నెల ఒకటో తేదీ ఉ. 6 గంటలకల్లా వారి ఇంటి వద్ద కే వాలంటీర్ల ద్వారా అందజేయడం జరుగుతుందని తెలిపారు. మన రాష్ట్రంలో కోటి 50 లక్షలు కుటుంబాలు ఉంటే అందులో 60 లక్షల కుటుంబాలకు సుమారు 65 లక్షల పింఛన్లను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఒకటో తేదిని 99% పెన్షన్లను పంపిణీ చేయడం జరుగుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన మొదటి ఏడాదిలో 2,250 రెండో ఏడాదిలో 2500ఇప్పుడు మూడో ఏడాదికి సంబంధించి 2750 అందజేయడం జరుగుతుందన్నారు.

వాలంటర్లు పింఛన్లు లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి అందజేస్తున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో అర్హులైన వారందరికీ అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను పంపిణీ చేస్తు న్నారని, మరొక మారు జిల్లా ప్రజలందరికీ నూతన సంవ త్సర సందర్భంగా అందరూ ఆరోగ్యంగా ఉండాలని మరొక్కసారి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలోని వృద్యాప్య వీవర్స్, వితంతు, అభయహస్తం, వికలాంగులు, కల్లుగీత కార్మికులు, హిజ్రాలు, మత్స్య కారులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, డిఎం అండ్ హెచ్ఓ, సికెడియు, కళాకారులకు, సైనిక వెల్ఫేర్ కింద మొత్తం 2,67,796 మందికి రూ.73.04కోట్లు లబ్ధి పొందనున్నారని తెలిపారు. నియోజకవర్గాలవారీగా చిత్తూరులోని 28,903 మందికి రూ.7.98కోట్లు, జిడి నెల్లూరులోని 43,381 మందికి రూ.11.79 కోట్లు, కుప్పంకు చెందిన 36,300మందికి రూ.10.09 కోట్లు, నగరి లోని 23,279 మందికి రూ.6.34 కోట్లు, పలమనేరులోని 44,836 మందికి రూ.12.34 కోట్లు, పుంగనూరులోని 44,181 మందికి రూ.11.98 కోట్లు, పూతలపట్టుకు చెందిన 46,916 మందికి రూ.12.49 కోట్లు లబ్ధి పొందనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అతిథులు చేతుల మీదుగా కొత్త పెన్షన్ల సంబంధించిన మంజూరు పత్రాలను, పింఛన్లు అందజేశారు.

పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్

నగర పాలక సంస్థలో నూతన సంవత్సర వేడుకలు

నూతన సంవత్సర వేడుకల్లో నగర కమిషన్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో నూతన ఆంగ్ల సంవత్సర దినోత్సవ వేడుకలను అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు ఉత్సాహంగా జరుపుకొన్నారు. నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదివారం ఉదయం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కమిషనర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఇంచార్జ్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిఆర్ఓ రాజశేఖర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు నగరపాలక ఉద్యోగులతో కలిసి చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానంద రెడ్డి, నగర మేయర్ ఎస్.అముదకు నూతన ఆంగ్లసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2023 నూతన ఆంగ్ల సంవత్సర దినోత్సవాన్ని నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుని ఉత్సాహంగా నిర్వహించారు. నగరపాలక ఇంజనీరింగ్, ప్రజారోగ్య, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, అకౌంట్స్, మెప్మా విభాగాల ఉద్యోగులు వారి శాఖాధిపతులతో కలసి నగర కమిషనర్ అరుణను కలసి పుష్పగుచ్ఛాలు అందించి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వార్డు సచివాలయ కార్యదర్శులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, నగరపాలక ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం కార్మికులు నగర కమిషనర్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. నగరపాలక కార్యాలయంలోనూ అయా విభాగాల ఉద్యోగులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

కాజూరు బాలాజికి శుభాకాంక్షలు తెలిపిన పలువురు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని తెలుగుదేశం పార్లమెంటరీ ఉపాధ్యక్షులు కాజూరు బాలాజీ నివాసం వద్దకు చిత్తూరు, గుడిపాల నుండీ పెద్దసంఖ్యలో తెలుగుదేశం నాయకులు ప్రజాప్రతినిధులు, బలిజ సంఘం నేతలు, తెలుగు యువత నాయకులు బాలాజీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కాజూరు బాలాజికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టిడిపి నాయకులు

అన్నప్రసాద వితరణ భవనం ప్రారంభం

భక్తులతో మాట్లాడిన టీటీడీ చైర్మన్

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలోని పిఎసి-4 (పాత అన్నదానం కాంప్లెక్స్)లో ఆదివారం సాయంత్రం నుంచి అన్నప్రసాద వితరణ ప్రారంభమైంది. టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి ఇక్కడ అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నప్రసాదం స్వీకరణకు వచ్చిన భక్తులతో ఆయన మాట్లాడారు. అనంతరం చైర్మన్ వైవి సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. 1985 నుండి 2011 జులై 7వతేదీ వరకు ఈ భవనంలో అన్నదానం కార్యక్రమం జరిగిందన్నారు. భక్తుల సంఖ్య పెరగడంతో వారి సదుపాయం కోసం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని నిర్మించామన్నారు. అన్నప్రసాదం కేంద్రానికి భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో తిరుమలలోని నాలుగు ప్రాంతాల్లో మినీ అన్నదానం భవనాలు ప్రారంభించాలని ధర్మకర్తల మండలి నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా పాత అన్నదానం భవనంలో తిరిగి అన్నదానం కార్యక్రమం ప్రారంభించినట్లు ఆయన వివరించారు. ఇక్కడ రోజుకు 15వేల మందికి అన్నదానం జరుగుతుందన్నారు. దీంతోపాటు మరో మూడు చోట్ల మినీ అన్నదానం భవనాలు ప్రారంభించి భక్తులు తాము వసతి పొందిన ప్రాంతాలకు సమీపంలోనే సులువుగా స్వామివారి అన్నప్రసాదం తీసుకునేలా ఏర్పాట్లు చేస్తామని సుబ్బారెడ్డి తెలిపారు.

సర్వదర్శనం టోకెన్ల గురించి...

తిరుమలలో 10రోజుల పాటు జరిగే వైకుంఠ ద్వార సర్వదర్శనం దర్శనం కోసం వచ్చేభక్తులకు తిరుపతిలోని 9ప్రాంతాల్లో ఆదివారం నుండి టోకెన్లు జారీ చేస్తున్నట్లు మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైర్మన్ సమాధానం ఇచ్చారు. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు సుమారు లక్షన్నర టోకెన్లు జారీ చేశారని తెలిపారు. 10 రోజుల కోటా పూర్తి అయ్యే వరకు నిరంతరంగా టోకెన్ల జారీ చేస్తామని ఆయన చెప్పారు. సర్వదర్శనం టోకెన్ల జారీ కేంద్రాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. భక్తులు టోకెన్లు తీసుకుని వారికి కేటాయించిన తేదీ, సమయానికే తిరుమలకు రావాలని చైర్మన్ మరోసారి విజ్ఞప్తి చేశారు. తిరుమలలోని క్యూ లైన్లలో కూడా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు వైద్యనాథన్ కృష్ణమూర్తి, అదనపు ఈవో వీరబ్రహ్మం, అన్నదానం డిప్యూటీ ఈవో సెల్వం, ప్రత్యేకాధికారి శాస్త్రితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్ల ప్రారంభం

భక్తుల రద్దీతో వేకువజాము నుండే మంజూరు

ఆదివారం సాయంత్రానికి 2లక్షల టోకెన్లు పొందిన భక్తులు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి టోకెన్ల కౌంటర్లను భక్తుల రద్దీ కారణంగా ఆదివారం వేకువ జాము నుండే సర్వదర్శన టోకెన్లను టిటిడి మంజూరు చేసింది. ఆదివారం మధ్యాహ్నం నుండి ఇవ్వాలని మొదట ప్రకటించిన ముందు రోజు నుండే క్యూల్లలో భక్తులు వేచి ఉన్నారు. స్వల్పంగా తొక్కిస లాటలు జరగడంతో టిటిడి మంజూరు ప్రక్రియను ప్రారంభించింది. దీంతో ఉదయం 9గంటల లోపు దాదాపు లక్షన్నర టికెట్లను భక్తులు పొందారు. టీటీడీ మరో మూడున్నర లక్షల టికెట్లను నిరంతరాయంగా మంజూరు చేసి కౌంటర్లను మూసివేయనుంది.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రొంపిచెర్ల : రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్ ను తలకోన సిద్దేశ్వర స్వామి సన్నిధిలో ఘనంగా ఆవిష్కరించారు. అలాగే రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కషి చేస్తుందని, నిత్యం ప్రజల అభివద్ధి కోసం పాటుపడుతుందని కొనియాడారు. కార్యక్రమంలో రాజంపేట ఎంపీ లోక్ సభ ప్యానల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శ్రీనాథ రెడ్డి, వైసీపీ నాయకులు చెంచురెడ్డి, పత్రికా విలేకరులు నూరేష, దేవలపల్లి అశోక్ కుమార్‌రెడ్డి, వై సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-కార్వేటినగరం: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అన్నారు. ఆదివారం విద్యుత్ ఏడీఈ నాగరాజు, ఏఈ రియాజ్‌బాషా, ఇంజినీర్ దినేష్ కలసి ఎంపీపీ లతాబాలాజీ దంపతులకు పుష్పగుచ్ఛాన్ని అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించడానికి కషి చేసి రైతుల నుంచి ప్రభుత్వంపై మంచి అభిప్రాయం వచ్చేలా చూడాలన్నారు. ప్రతిఒక్కరికీ విద్యుత్ ఎంతో అవసరం కాబట్టి గ్రామాల్లో ఎక్కడ సమస్యలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ధనంజయవర్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, నాయకులు పద్మనాభరెడ్డి, పట్టాభిరెడ్డి, పురంధర్ శేషాద్రి పలువురు పాల్గొన్నారు.

ఉమాదేవి ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉమాదేవి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు, డాక్టర్ హరిబాబు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి కషి చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ కార్వేటినగరంలో ఎంబీబీఎస్ అర్హత ఉన్న వైద్యులు అందుబాటులో లేకుండా పుత్తూరు, తిరుపతికి వెళ్లాల్సి వస్తుందని, ఇబ్బందులు లేకుండా గ్రామీణ ప్రాంతంలో మల్టీస్పెషాలిటీ వైద్య సౌకర్యాన్ని అందుబాటులో తీసుకొచ్చారని, నాణ్యమైన వైద్యం అందించి గ్రామీణులకు అండగా ఉండాలని కోరారు. ఆయన వెంట పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ, శేషాద్రి, లోకనాథరెడ్డి, పట్టాభిరెడ్డి, పద్మనాభరెడ్డి, పురంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ, జడ్పీటీసీలకు సన్మానం



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు ఎంపీపీ అనిత, జడ్పీటీసీ లక్ష్మీ ప్రియ లకు పలువురు వైసీపీ నేతలు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణా రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, మండల వైస్ ఎంపీపీ హరిబాబు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటరెడ్డి, ఎంపీడీవో శ్రీదేవి, ఈవోపీఆర్డీ శివయ్య, ఏపీవో శ్రీనివాసులు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి-రొంపిచెర్ల: ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులందరికీ అందించాలని డివిజనల్ డెవలప్మెంట్ అధికారి (డీఎల్డీఓ) రవికుమార్ తెలిపారు. రొంపిచెర్ల మండలంలోని గ్రామ సచివాలయాలను శనివారం రవికుమార్ ఆకస్మికంగా తనిఖీచేశారు. సచివాలయ రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, ప్రజా ఫిర్యాదుల రిజిష్టర్ తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో సచివాలయ వ్యవస్థను అమలుచేస్తోందని, ప్రజలకు అందించే మెరుగైన సేవలకు సచివాలయాలు వేదికలు కావాలన్నారు. ప్రజా ఫిర్యాదులను నిబంధనల మేరకు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, పంచాయతీ కార్యదర్శి నాగరాజ, రవిచంద్రబాబు, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసు, వలంటీర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-సోమల: సోమల మండలంలోని అన్ని పంచాయతీలలో జనవరి ఒకటో తేదీ అన్ని సామాజిక పింఛన్లను వాలంటీర్ల ఆధ్వర్యంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. కందూరు, వల్లిగట్ల, కామిరెడ్డి వారి పల్లి, పొదలకుంటపల్లి పంచాయతీలలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని ఆలయాలు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా కార్వేటినగరం ప్రసిద్ధిచెందిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయం, బాలాజీ నగర్‌లో వెలసియున్న శ్రీషిరిడీ సాయినాధుని ఆలయం, స్కంద పుష్కరణి వద్ద వెలసి ఉన్న శ్రీరాజరాజేశ్వరిదేవి, బంగారమ్మ ఆలయం, సురేంద్రనగరంలోని వరద వెంకటేశ్వరస్వామి ఆలయాలల్లో భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆదివారం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారిని ఆలయంలో అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయ దేవేరులతో పాటు స్వామివారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే శ్రీ షిరిడి సాయినాథుని ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని సుగంధ భరిత పుష్పాలతో అలంకరించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందించారు. సురేంద్ర నగరంలో వెలసి ఉన్న వరద వెంకటేశ్వర స్వామి వారిని భక్తులు పలు గ్రామాల నుంచి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పాలసముద్రం: మండలంలోని పలు ఆలయాల్లో కొత్త సంవత్సరం సందర్భంగా ఆదివారం ఆలయంలోని భక్తులు కిటకిటలాడారు. గ్రామాల్లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందంగా గడిపారు. చర్చిలో పాస్టర్ పాల్‌రాజ్ కేక్ కోసి అందరికీ పం చిపెట్టారు. వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు.

పులిచెర్ల: రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని వారి నివాసంలో ఆదివారం పులిచెర్ల మండలానికి చెందిన అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం పరిశీలకులు వల్లివేడు రాజారెడ్డి నూతన సంవత్సర శు

భాకాంక్షలు తెలిపారు. ముందుగా మంత్రి పెద్దిరెడ్డి దంపతులకు పుష్ప గుచ్ఛం అందజేసిన అనంతరం ఎంపీ మిథున్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. వీరి వెంట జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

గంగాధర నెల్లూరు: నూతన సంవత్సరం పురస్కరించుకొని చిత్తూరు నగరంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహర్ నాయుడు, పాలసముద్రంలో నియోజవర్గ టిడిపి కోఆర్డినేటర్ భీమనేని చిట్టిబాబు నాయుడులకు నియోజవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు స్వామిదాస్, చెంగ్రాలయ యాదవ్, నేతలు జనార్దన్ రాజు, జ్యోతిశ్వర్ రెడ్డి, నియాజ్ అలీ, మునిరాజు యాదవ్, జ్యోతి యాదవ్, కిషన్ చంద్, ఎట్టేరి కోదండరెడ్డి , నెల్లేపల్లి సుబ్రహ్మణ్యం, కొత్తపల్లి రమేష్ ,శివప్రసాద్, ఆర్ముగం, వినాయకం, చెల్లయ్య, అగరం శివా పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి సేవలో మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-పులిచెర్ల: రాష్ట్ర విద్యుత్తు, అటవీ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజంపేట, చిత్తూరు ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రెడ్డెప్పలు ఆదివారం దేవలంపేట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి, రెడ్డెప్పకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన మంత్రి పెద్దిరెడ్డి మొక్కులు తీర్చున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేక్ ను కట్ చేసిన మంత్రి పెద్దిరెడ్డి మండలంలోని ప్రజా ప్రతినిధులకు, అభిమానులకు పంచిపెట్టారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ లు మిథున్ రెడ్డి, రెడ్డెప్పలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పాలఏకరి కార్పోరేషన్ ఛైర్మన్ మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-రొంపిచెర్ల: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, రాజంపేట ఎంపీ వెంకట మిథున్ రెడ్డి కి మండల వైసీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి ఆదివారం ఉదయం తలకోనలో సిద్దేశ్వర స్వామి వారిని దర్శించుకొని సదుంకు వెళ్తున్న మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీలు విజయశేఖర్, నూలు రెడ్డెప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు దేవులపల్లి హరినాథ రెడ్డి, సర్పంచులు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, అన్సర్ బాషా, సుధారాణి, హేమలత, సుష్మ, ఎంపీటీసీ రమణమ్మ, కోఆప్షన్ మెంబర్ సుంకేసుల ఖాదర్ బాషా, వైసీపీ నాయకులు చెంచురెడ్డి, కోటా వెంకటరమణ, సూర్యనారాయణ రెడ్డి, యుగంధర్ రెడ్డి, వెంకటరమణ రెడ్డి, మైనారిటీ జిల్లా కార్యదర్శి సైదుల్లా ఖాన్, మల్లికార్జున రెడ్డి, భాస్కర్ రెడ్డి, మల్లేపల్లి మీనాక్షి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రకు మద్దతు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: యువగళం పాదయాత్రకు మద్దతు తెలపాలని మండల టీడీపీ అధ్యక్షులు జయప్రకాష్ అన్నారు. ఆదివారం టీడీపీ జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువత భవిష్యత్తు కోసం చేపట్టబోయే యువగళం పాదయాత్రకు ముందస్తు మద్దతుగా మండల కేంద్రంలో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 27న కుప్పం నుంచి శ్రీకాకుళం వరకు 400 రోజులు 4 వేల కిలోమీటర్ల వరకు జరిగే పాదయాత్రకు నిరుద్యోగ యువత కోసం, అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్ రక్షణ కోసం గత ప్రభుత్వాల సంక్షేమ పథకాలు కొనసాగింపులో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని.. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు నిరంతరం కష్టాలు చూస్తున్నారని వివరిస్తూ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోదండయాదవ్, సిద్దయ్య, జనార్ధన్‌గౌడ్, నాగరాజుగౌడ్, రాధిక, పలువురు టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరంలో మెరుగైన సేవలు

ప్రజాశక్తి-వికోట: నూతన సంవత్సరంలో ప్రభుత్వపరంగా నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తనవంతు కషి చేస్తానని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. ఎమ్మెల్యే స్వగ్రామం తోటకనుమలోని తన నివాసంలో నూతన సంవత్సర వేడుకలను ఆదివారం అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. వి కోట ఎంపీపీ యువరాజ్ వైస్ ఎంపీపీ తమిమ్ ఖాన్ లు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు.. అధికారులు.. అభిమానులు వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల అభిమానం తో నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల అభివద్ధి సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు కషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెంచిన వివిధ రకాల పింఛన్లు జనవరి ఒకటో తారీకు నుంచి ప్రజలకు అందించడంతో వారికి తమ ప్రభుత్వంపై మరింత నమ్మకం కలిగిందని వారు పేర్కొన్నారు.

కైగల్ జలపాతానికి పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: తీర్థం పంచాయతీలోని కైగల్ దుముకురాల జలపాతం ఆదివారం ఆంగ్ల సంవత్సరాది కావడంతో కర్ణాటక తమిళనాడు రాష్ట్రాలకు చెందిన యువతీ యువకులు సుమారు 5 లక్షల మందికి పైగా జలపాతం వద్దకు చేరుకొని జలపాతం మధ్యలో ప్రతిష్ఠించిన శివలింగాన్ని దర్శించేందుకు యువతీ యువకులు ఇరువైపులా వస్తున్న గంగ ప్రవాహాన్ని అతి కష్టం మీద ప్రాణ భయంతో దాటుకుని వెళ్లి శివలింగానికి పూజలు నిర్వహించారు. సాయంత్రం వరకు పర్యాటకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తలకోనలో మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం : నూతన సంవత్సరం పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొత్త సంవత్సరం పరిష్కరించుకొని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, ఎంఆర్‌సి రెడ్డి, మోహిత్ రెడ్డి, ఆదివారం ఉదయాన్నే తలకోనకు విచ్చేశారు. అనంతరం మండల వైసీపీ నాయకులు వీరికి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దర్శనార్థం వచ్చిన భక్తులను రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆప్యాయంగా పలకరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చెవిరెడ్డి నెరబైలు పంచాయతీలో పెంచిన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు చెంగ్రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, నాగార్జున రెడ్డి, హరినాథ్ రెడ్డి, ఎంపీపీ శివలక్ష్మి, జెడ్పిటిసి కరుణాకర్ రెడ్డి, తలుకొన ఛైర్మన్ ఉమామహేశ్వర్ రెడ్డి, బాబి, ఈవో జయకుమార్, వెంకటరమణారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగాలకు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో ఫర్జానా కోరారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొట్టంబేడు ప్రాజెక్టు పరిధిలో తొట్టంబేడు, కేవీబీపురం, బుచ్చి నాయుడుకండ్రిగ మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు నాలుగు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు మూడు, అగన్ వాడీ హెల్పర్ 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. తొట్టంబేడు మండల పరిధిలో శివనాథపురం, విరూ పాక్షపురం, పెద్దకన్నలిలో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు.. విరూపాక్షపురం యానాదికాలనీలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు... కాసరం. కొమ్మనగుంట గ్రామాల్లో అంగనఖ వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఫర్జానా కోరారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు

ప్రజాశక్తి-పాలసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీని మాట ప్రకారం నెరవేరుస్తున్నారని ఎంపీపీ శ్యామల, శివప్రకాష్ రాజు, జడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ తెలిపారు. ఆదివారం పింఛన్లను రూ.250 పెంచుతూ రూ.2,750 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 3,699 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నారని.. నూతన సంవత్సరంలో పింఛను పెంచడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

పేదల సేవే మా పరమార్థం

ప్రజాశక్తి -తొట్టంబేడు: పేదల సేవే తమ పరమార్థమని జాతీయ వినియో గదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర డిప్యూటీ ఛైర్మన్ వెలంపాటి కోటేశ్వర బాబు, ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి చెప్పారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని ఆదివారం తొట్టంబేడు మండలం పిల్లమేడు, మామిడిగుంట గిరిజనకాలనీల్లో జాతీయ వినియోగ దారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి ఆధ్వర్యంలో గిరిజనులకు దుప్పట్లు, పండ్లు, మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా కోటేశ్వరబాబు, కలవగుంట భరత్ రెడ్డి మాట్లాడుతూ... జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ వినియోగదారుల హక్కులను కాపాడటానికి పని చేస్తోందన్నారు. వినియోగదారులకు ఎవరైనా అన్యాయం చేస్తే తమ కమిషన్‌కు తెలియజేయాలని వారు కోరారు. తాము ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. తాము వినియోగదారుల హక్కుల కోసమే కాకుండా ఈ కమిషన్ ద్వారా పేదలకు సేవ చేయాలని కూడా నిర్ణయించుకున్నట్లు వారు చెప్పారు. పేదలకు సేవ చేయడానికి ఇదో మంచి వేదిక అని వారు అభిప్రాయపడ్డారు. పేదలకు ఏ కష్టం వచ్చినా వారికి అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న అని పెద్దలు చెప్పారని... అందుకే తాము పేదలకు సేవ చేస్తున్నట్లు వారు చెప్పారు. పేదలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉందన్నారు. పేదలకు మరిన్ని సేవలు అందించి అందరికీ ఆదర్శంగా ఉండాలన్నదే తమ అభిమతం అన్నారు. అనంతరం ఎన్‌సీఆర్‌సీపై పిల్లమేడు, మామిడిగుంట గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గురవయ్య, భాస్కర్, ధనుంజయ్, మహేష్ నాయుడు, సురేష్, బాబు, మణికంఠ, రామయ్య, శ్రీను, కాటయ్య, రాఘవయ్య, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి-నాయుడు పేట: మండలంలోని మర్లపల్లికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తిని అర్ధ రాత్రి పట్టణమంతా నూతన సంవత్సర సంబరాలలో ఉండగా తోటి స్నేహితులే విచక్షణా రాహిత్యంగా పొడిచి చంపిన ఘటన నాయుడుపేట పట్టణంలోని పోగొట్టం కాలనీలో జరిగింది. కొత్త సంవత్సరం సంబరాలలో ఉన్న పట్టణ ప్రజలు ఈ సంఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కొంత కాలంగా మృతుడు పొగొట్టం కాలనీలో నివాసం ఉంటున్నట్లు సమాచారం చుట్టుపక్కల వారు చెప్పుకొచ్చారు. గతంలో ఆటో తోలుతూ జీవనం సాగిస్తున్న వెంకటేశ్వర్లు ప్రస్తుతం మెకానిక్ షెడ్డు నడుపుతున్నట్లు సమాచారం. రాత్రి పన్నెండు గంటల తర్వాత ఈ సంఘటన జరిగిందన్నారు. గుండె దగ్గర 11 కత్తిపోట్లు ఉండగా, గొంతు కోసి మరీ హత్య చేశారు. వివాహేతర సంబంధాలే హత్యకు దారి తీసిఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘాతుకానికి పాల్పడ్డ వారిలో ముగ్గురు దొరికారని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని నాయుడుపేట పట్టణ సీఐ ప్రభాకర్ రావు వివరించారు. ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ట్రాక్టర్ బోల్తా వ్యక్తి మృతి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని చింతగుంట పంచాయతీ చిన్నబయలు పచ్చారావాండ్లపల్లి దగ్గర కన్నయ్య(40) అనే రైతు పొలం దగ్గర మహేంద్ర ట్రాక్టర్‌తో పొలం పనులు చేసుకొని తిరిగి ఇంటికి వెళు తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడటంతో కన్నయ్య అక్కడికక్కడే మృతి చెందారు. విషాదఛాయలు అలుముకున్నాయి.

జనరల్ వార్తలు

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ప్రజాశక్తి-వి.కోట: ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వివాహిత మృతిచెందిన సంఘటన మండలంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు .. మండల పరిధిలోని ఎరినాగేపల్లికి చెందిన కొండప్ప కుమార్తె భవాని (26). పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఓగు పంచాయతీ మట్టిగుట్టపల్లిలో అత్తింటి వేధింపులు తాళలేక డిసెంబర్ 16న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను కుప్పం మెడికల్ కళాశాలకు తరలించారు. గత 15 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం పొదలకుంటపల్లి గ్రామానికి చెందిన కోటకొండ కృష్ణయ్య(55) గత ఆదివారం ఎర్రగుంతలపల్లి వద్ద ద్విచక్ర వాహనంలో వెళుతూ ఉండగా ఎదురుగా వస్తున్న మరొక ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడి తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

బిడ్డకు పురుడు పోసిన 108 సిబ్బంది

ప్రజాశక్తి - ఎస్‌ఆర్ పురం : ఎస్‌ఆర్ పురం మండలంలో మగ బిడ్డకు 108 వాహనంలో పురుడు పోసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఆదివారం ఎస్‌ఆర్ పురం మండలం లోని ఎగువ కమ్మకండ్రిగ గ్రామపంచాయతీ మిట్ట హరిజనవాడ గ్రామానికి చెందిన రాజేష్ భార్య గౌతమికి పురిటి నొప్పులు రావడంతో 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికం కావడంతో పైలెట్ చిట్టిబాబు, ఈఎన్‌టీ సందీప్ 108 వాహనం లోనే ప్రసవం చేశారు. గౌతమి మగ శిశువుకు జన్మనిచ్చింది. కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రథమ ఉపాధ్యాయురాలు భారతి తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జిఎఫ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అండర్- 17, బాలుర విభాగంలో పవన్ ప్రశాంత్ నవీన్, అండర్ -17 దీపిక, మౌనికలోచిని, అండర్- 14. బాలుర విభాగంలో రాజా, వరుణ్, అండర్-14, బాలిక విభాగంలో ఉదయశ్రీ, ఆర్తి, మౌనిక ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 11, 12, 13న నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరుగు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ గోపికృష్ణ తెలిపారు. ఈ ఎంపిక పట్ల ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు బృందం, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి -యర్రావారిపాలెం: మండలంలోని విఆర్ అగ్రహారం, బోడేవాళ్ళపల్లి పంచాయతీలలో పలు గ్రామాలకు రోడ్డు ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజల విజ్ఞప్తి మేరకు విఆర్ అగ్రహారం పంచాయతీ సర్పంచ్ రాయవరం వెంకటరమణారెడ్డి చొరవతో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. తిరుపతి నుండి ఎల్లమంద పైగా సుండుపల్లికి వెళు తున్న ఆర్టీసీ బస్సు రెండు పంచాయతీల్లో పలు గ్రామాలను కలుపుకొని ప్రజల సౌకర్యార్థం వెళ్లాలన్నారు. గతంలో ప్రజలు కోరుకోవడంతో నేటి నుంచి గ్రామాల్లో ప్రజలకు సౌకర్యంగా సుండుపల్లి బస్సు నడవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

తహశీల్దార్ మధుసూదన్ రావుకు సన్మానం

ప్రజాశక్తి- పిచ్చాటూరు : ఆదివారం కొత్త సంవత్సరం శుభాకాంక్షలు పిచ్చాటూరు మండలం తహశీల్దార్ మధుసూదన్ రావును రెవెన్యూ వీఆర్వోలు క్షేత్ర సహాయకులు ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేశారు. తహశీల్దార్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో రెవెన్యూ సిబ్బందిలో అందరూ కలిసి కార్యాలయంలో కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకుందామని అలాగే మండలంలోని ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. నూతన సంవత్సరాలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగనీయకుండా రెవెన్యూ పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి వెంకటేశులు, వీఆర్వోలు దేవదాస్, వెంకటేశులు, ప్రియాంక, భాష, సెల్వం, వీఆర్‌ఏలు, ధనవేలు, వెంకటేశులు, రవి, శరవణ, రామదాసు, సుజాత, ఈశ్వర్, మొదలగు వారు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళి

ప్రజాశక్తి - రేణిగుంట: నూతన సంవత్సరం సందర్భంగా రేణిగుంట సీనియర్ సిటిజన్స్ వారి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నగేషంను, వైకాపా కార్యాలయంలో ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డిని, జెడ్పిటిసి సంధ్యాని కలిసి శాలవాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తనయురాలు పవిత్ర రెడ్డి జన్మదినం సందర్భంగా రేణిగుంటలో ఆమెను కలిసి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర, హసన్ సాహెబ్, అప్పారెడ్డి, వెంకటేశ్వర్లు, రంగయ్య, రవి, భాష, తిమ్మారెడ్డి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

పవిత్రమ్మ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - రేణిగుంట : పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం రేణిగుంట వైసీపీ ఇన్‌ఛార్జి పవిత్రమ్మ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా రేణిగుంట బ్రాహ్మణుల సేవా సంఘం నాయకులు ఆమెను శాలువతో సన్మా నించి పుష్పగుమిచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రామ్మోహన్, ఉపాధ్యక్షుడు ప్రకాష్, సెక్రటరీ, శివ కార్యవర్గ సభ్యులు అశోక్, ఉమా, పవన్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
'e' ప్రొక్యూర్మెంట్ షార్ట్ టెండర్ నోటీసు నిట్ నెంబర్.159 నుండి 161 వరకు/ఇఇ(ర.భ.) చిత్తూర్/టి.ఓ/2022-23, తేది: 31.12.2022
చిత్తూరు (ర.భ) డివిజన్ పరిధిలోని మూడు పనులకు గాను సుమారు రూ. 41,00,000/- అంచనాతో 2022-2023 సంవత్సరమునకు గాను, 'e' ప్రొక్యూర్మెంట్ ఫ్లాట్ ఫాం క్రింద ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరుదారులు తమ టెండర్లను దాఖలా చేయు తేదీలు : 02.01.2023 మధ్యాహ్నం 3.00 గంటల నుండి నుండి 06.01.2023 మధ్యాహ్నం 3.00 గంటలు 30ని॥లు వరకు టెండర్ పనులు దాఖలు చేయుటకు ఆఖరు తేది సెలవు దినముగా ప్రకటించిన ఎడల తదుపరి దినమును ఆఖరి తేదిగా పరిగణింపబడును. తదుపరి వివరములకు ఈ కార్యాలయము పని వేళలయందు పొందవచ్చును. మరియు మార్పులు చేర్పులు చేయు అధికారము కార్యనిర్వాహక ఇంజినీరు వారికి కలదు.
సం/- కార్యనిర్వాహక ఇంజినీరు,
చిత్తూరు (ర.భ.) విభాగము.